# ఇటలీలో పాటల హంగామా



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్‌అశ్విన్ దర్శకుడు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. మే 8న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తాలూకు తాజా అప్‌డేట్ వెలువడింది. ఇటలీలోని సార్డినియా ద్వీపంలో ప్రభాస్, దిశాపటానీలపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. సుందరమైన లొకేషన్లలో ఈ పాటను తెరకెక్కిస్తున్నారని, విజువల్స్ అబ్బురపరుస్తాయని చెబుతున్నారు. మహాభారత కాలంలో మొదలై 2898 కాలంలో ఈ చిత్ర కథ ముగుస్తుందని దర్శకుడు నాగ్‌అశ్విన్ ఇటీవల ఈ సినిమా తాలూకు కథ గురించి తెలిపారు. దీంతో ప్రేక్షకులు ఈ సినిమా ఆగమనం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక హంగులతో వైజయంతీ మూవీస్ పతాకంపై అగ్ర నిర్మాత అశ్వనీదత్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్ వంటి అగ్ర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# హద్దులు లేని ప్రేమను పంచావ్

*2005లో 'చాంద్ సా రోషన్ చెహ్రా'తో తెరంగేట్రం చేసింది మిల్కీ బ్యూటీ తమన్నా. అదే ఏడాది మనోజ్ 'శ్రీ' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. మొత్తంగా 19ఏళ్ల కెరీర్‌ని పూర్తి చేసుకుంది తమన్నా. దాంతో తమన్నాపై అభిమానులు శుభాకాంక్షల వర్షం కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నటి కాజల్ కూడా మిల్కీబ్యూటీకి శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు ఎడిట్‌చేసిన తమన్నా పోస్టర్‌ను తన వ్యక్తిగత సామాజిక మాధ్యమంలో షేర్ చేసింది. దానిపై తమన్నా స్పందించింది. 'నా కెరీర్ ఇంత హాయిగా సాగుతోందంటే కారణం నీ స్నేహం. ఇన్నేళ్లు నాకెంతో మద్దతుగా నిలిచావు. హద్దులు లేని ప్రేమను పంచావు. థాంక్యూ కాజూ..' అంటూ రిప్లయ్ ఇచ్చింది తమన్నా. ఇంకా చెబుతూ 'ఇంతమంది అభిమానుల్ని సంపాదించుకోగలిగాను. వారి ఉత్సాహమే నాలో శక్తిని రెట్టింపు చేస్తున్నది. రానున్న కాలం ప్రేమతో నిండిన లెక్కలేనన్ని జ్ఞాపకాలకు వేదిక కానుంది. మీ అందరికీ నచ్చే సినిమాలే చేస్తానని హామీ ఇస్తున్నా' అంటూ అభిమానులను ఉద్దేశించి పోస్ట్ పెట్టింది తమన్నా.*

# ఫ్యామిలీ జోలికొస్తే మడతపెట్టేస్తాడు



ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' ఒకటి. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి పరశురామ్ దర్శకుడు. దిల్‌రాజు, శిరీష్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచారచిత్రాలకు ప్రేక్షకుల్లో మంచి స్పందన లభించిందని చిత్రబృందం ఆనందం వెలిబుచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రానికి చెందిన టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. గోపీ సుందర్ సంగీత దర్శకత్వం వహించిన 'దేఖోరే దేఖో..' పాటతో హీరో పాత్రచిత్రణను అభివర్ణిస్తూ టీజర్ ఆద్యంతం కలర్‌పుల్‌గా సాగింది. సర్ నేమ్‌కు సరెండరై, ఫ్యామిలీ అంటే వీక్‌నెస్ ఉన్న కలియుగ రాముడిగా ఈ టీజర్‌లో విజయ్ దేవరకొండ కనిపించాడు. కుటుంబ క్షేమం కోసం దైవాన్ని పూజిస్తూ, వారిని కంటికి రెప్పలా చూసుకుంటుంటాడు ఇందులో హీరో. వాళ్లజోలికి ఎవరైనా వస్తే మడతపెట్టి కొడతాడు. అతను వేస్తే బడ్జెట్ షాక్. ప్లాన్ గీస్తే ప్రాజెక్ట్ షేక్.. అంటూ టీజర్‌లో హీరో గురించి దాదాపుగా చెప్పేశారు. టీజర్ చివరల్లో మృణాల్ అడుగుతుంది.. 'కాలేజ్‌కి వెళ్లాలి.. కొంచెం దింపుతావా?' అని. 'లీటర్ పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా..' అంటాడు హీరో. కంప్లీట్ ఫ్యామిలీమేన్‌గా ఇందులో విజయ్ దేవరకొండ కనిపిస్తాడనటానికి ఈ టీజర్ ఓ ఉదాహరణ.

# మల్టీస్టారర్ షురూ



తెలుగులో అప్పుడప్పుడు మల్టీస్టారర్ సినిమాలు పలకరించడం కామనే. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, గోపాల గోపాల, ఆర్‌ఆర్‌ఆర్, ఎఫ్2, వెంకీమామ.. ఇలా మల్టీస్టారర్స్ వస్తూనేవున్నాయి. రానున్న భారీ మల్టీస్టారర్ అంటే అందరికీ గుర్తొచ్చే సినిమా 'కల్కీ 2898 ఏడీ'. ఇందులో ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్, దుల్కర్ ఇలా చాలామంది స్టార్లు నటిస్తున్నారు. రాబోతున్న 'ఎన్‌బీకే 109' కూడా ఓ విధంగా మల్టీస్టారరే అనాలి. ఎందుకంటే అందులో బాలకృష్ణతో పాటు దుల్కర్‌సల్మాన్ కూడా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్‌లో మల్టీస్టారర్‌కి తెర లేవనుంది. దుల్కర్ సల్మాన్, అడివి శేషు ఇందులో నటించే స్టార్లు. దర్శకుడు పరశురామ్ దగ్గర పనిచేసిన ఓ యువ దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనేది లేటెస్ట్ న్యూస్. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.



## 'కన్నప్ప' కోసం ప్రభుదేవా

హీరో మంచు విష్ణు తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' చిత్ర రెండో షెడ్యూల్‌ను ఇటీవలే న్యూజిలాండ్‌లో ప్రారంభించిన విషయం తెలిసిందే. శ్రీ కాళహస్తి స్థలపురాణం నేపథ్యంలో భక్తిరస ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఈ సినిమాలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర నటులు భాగం అవుతున్నారు. ఈ సినిమా తాలూకు తాజా అప్‌డేట్ వెలువడింది. ఈ చిత్రానికి ప్రభుదేవా నృత్యరీతుల్ని సమకూర్చబోతున్నారు. ఈ మేరకు చిత్ర బృందం న్యూజిలాండ్‌లో ఆయనకు స్వాగతం పలికింది. ప్రభుదేవా రాకతో 'కన్నప్ప' చిత్రం మరో స్థాయికి వెళ్లిందని, ఆయన కొరియోగ్రఫీ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై మోహన్ బాబు నిర్మిస్తున్నారు.

# పరశురామ క్షేత్రం నేపథ్యంలో జరిగే కథ



'గోపీచంద్ గతంలో కొన్ని పోలీస్ పాత్రలు చేశారు. కానీ ఇలాంటి పోలీస్‌గా చేయడం మాత్రం ఇదే ప్రథమం. ప్రస్తుతం ప్రేక్షకులు ఇలాంటి కథలను బాగా ఆదరిస్తున్నారు. తప్పకుండా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే సినిమా అవుతుంది' అన్నారు నిర్మాత కె.కె.రాధామోహన్. గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన చిత్రం 'భీమా'. ఏ.హర్ష దర్శకుడు ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడారు. 'ఇటీవల విడుదలైన గోపీచంద్ సెకండ్ లుక్, ట్రైలర్‌లోని కొన్ని సన్నివేశాలను చూసి చాలా మంది ఈ సినిమాను 'అఖండ'తో పోలుస్తున్నారు. నిజానికి ఈ సినిమాతో 'అఖండ'కు ఏమాత్రం సంబంధంలేదు. ట్రైలర్‌లో చూపించిన పరశురామ క్షేత్రం బెంగళూరు, బాదామీ పరిసరాల్లో ఉంటుంది. ఆ క్షేత్రం నేపథ్యంలో జరిగే కథ ఇది. ట్రైలర్‌లో కనిపిస్తున్న అఘోరాలు, శివాలయం ఇవన్నీ కేవలం యాంబియన్స్ కోసమే. అంతే తప్ప అఘోరాలకూ ఈ కథకూ ఎలాంటి సంబంధం లేదు' అని తెలిపారు రాధామోహన్. సినీ నిర్మాణం రిస్క్‌తో కూడుకున్న బాధ్యత అని, ప్రేక్షకుల అభిరుచికి తగ్గ కథను ఎంచుకోవడం, కథకు తగ్గ పాత్రధారులను ఎన్నుకోవడం, సరైన సాంకేతిక నిపుణులను తీసుకోవడం... ఇవన్నీ చిన్న విషయాలు కావనీ, దర్శకుడు హర్ష క్లారిటీ ఉన్న దర్శకుడు కాబట్టే, తనను దాదాపుగా ఇబ్బందిపెట్టలేదని, ఇందులో రెండు పాటలకు తనే కొరియోగ్రఫీ కూడా చేశాడని నిర్మాత చెప్పారు. ' కథ డిమాండ్ మేరకు భారీ సెట్టింగులు నిర్మించాం. ఇందులోని వీఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్స్ తెరపై ఓ అద్భుతాన్ని చూస్తున్న అనుభూతికి లోనుచేస్తాయి' అని చెప్పారు. బిజినెస్ పరంగా కూడా హ్యాపీగా ఉన్నామని, డిస్ట్రిబ్యూటర్లు కూడా సినిమాపై ఆసక్తిని కనపరిచారని ఆయన ఆనందం వెలిబుచ్చారు.



# వేసవిలో వస్తున్న 'ఆయ్'

*నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న చిత్రం 'ఆయ్'. అంజి కంచిపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై బన్నీ వాసు, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం దర్శకనిర్మాత, నాయకానాయికల మధ్య జరిగిన సరదా ఫోన్ సంభాషణతో టైటిల్‌ను ప్రకటించారు. గోదావరి జిల్లాల ప్రజలు తరచుగా ఉపయోగించే 'ఆయ్' పదం నేపథ్యంలో ఈ సంభాషణ నవ్వుల్ని పూయించింది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ఈ నెల 7న విడుదల చేయబోతున్నామని, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె, దర్శకుడు: అంజి కంచిపల్లి.*

# ఓ సాహస యాత్రలా అనిపించింది



'కొన్ని కథలు విన్నప్పుడు నన్ను నేను నియంత్రించుకోలేను. 'గామి' కథ విన్నప్పుడు తప్పకుండా అందులో భాగం కావాలనిపించింది' అని చెప్పింది చాందిని చౌదరి. ఆమె కథానాయికగా విశ్వక్‌సేన్‌తో కలిసి నటించిన చిత్రం 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకుడు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చాందిని చౌదరి మాట్లాడుతూ ''గామి' అంటే గమ్యాన్ని గమించేవాడు అని అర్థం. ఈ సినిమాను వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాల్లోని రియల్ లొకేషన్స్‌లో షూట్ చేశారు. సినిమా ప్రయాణం అంతా ఓ సాహస యాత్రలా సాగింది. టీం అంతా ఐదేళ్ల పాటు సినిమా కోసం శ్రమించాం. ఐమాక్స్ స్క్రీన్‌లో ట్రైలర్ చూసినప్పుడు మేం పడిన కష్టానికి ప్రతిఫలం లభించిందనే భావన కలిగింది' అని చెప్పింది. నటిగా పదేళ్ల సినీ ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, జయాపజయాలతో సంబంధం లేకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పనిలో సాగిపోవాలనే సత్యాన్ని తెలుసుకున్నానని ఆమె తెలిపింది. అన్ని జోనర్స్ సినిమాలు చేయాలన్నదే తన లక్ష్యమని, ఈ ఏడాది తాను నటించిన నాలుగు సినిమాలు రాబోతున్నాయని చాందిని చౌదరి పేర్కొంది.



# రంగ్ రంగ్ రంగీలా..

*చైతన్యరావు, సునీల్, శ్రద్ధాదాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'పారిజాతపర్వం'. సంతోష్ కంభంపాటి దర్శకుడు. మహీధర్‌రెడ్డి, దేవేష్ నిర్మాతలు. క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి చెందిన పాటను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. 'రంగ్ రంగ్ రంగీలా..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, రీ స్వరపరిచారు. శ్రద్ధాదాస్ ఈ పాటను స్వయంగా పాడటం విశేషం. శ్రద్ధాదాస్ వాయిస్, గ్లామర్ ప్రెజెన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని మేకర్స్ చెబుతున్నారు. వైవా హర్ష, శ్రీకాంత్ అయ్యంగార్, సురేఖవాణి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాల సరస్వతి.*

# అడవి నుంచి అంతర్జాతీయంగా ఎదిగిన కవలల కథ



'అడవిలో పెరిగిన అనాథలైన ఇద్దరు కవలల కథ ఇది. అడవిలో కుస్తీ పోటీలు నేర్చుకుని, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారు వీరిద్దరూ. ఆ కవలలుగా నేనే నటించాను. కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి మంచి పాత్ర దొరకడం నిజంగా నా అదృష్టం.' అన్నారు సహజనటి జయసుధ కుమారుడు, హీరో నిహిర్ కపూర్. ఆయన హీరోగా నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకుడు. చదలవాడ పద్మావతి నిర్మాత. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిహిర్ కపూర్ విలేకరులతో ముచ్చటించారు. 'కథలో హీరో కేరక్టరైజేషన్ నచ్చి చేయడానికి ఒప్పుకున్నాను. సెంటిమెంట్, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో ఉంటాయి' అని చెప్పారు నిహిర్. ఇంకా చెబుతూ ఇందులో డబ్ల్యూ డబ్ల్యూ పోటీలు చూపిస్తున్నామని, కుస్తీ పోటీల నుంచి డబ్ల్యు డబ్ల్యూ దాకా జరిగే ట్రాన్స్‌ఫర్మేషన్ కొత్తగా ఉంటుందని, ఇది దేశం గర్వించదగ్గ సినిమా అనీ, ఇలాంటి సినిమా ఒక భాషకే పరిమితం కాకూడదు కాబట్టే పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నామని నిహిర్ అన్నారు. 'మా అమ్మగారు ట్రైలర్‌తో పాటు సినిమా కూడా కొంతవరకు చూశారు. బాగా చేశావ్ అని మెచ్చుకున్నారు. సినిమా మొత్తం చూశాక ఎలా రియాక్టవుతారో చూడాలి. నా కథలు వినేంత టైమ్ అమ్మకు లేదు. అందుకే నేనే కథలు వింటున్నా. 'హరిహరవీరమల్లు'లో ఓ ముఖ్యపాత్ర చేస్తున్నాను. డైరెక్షన్ కోర్స్ నేర్చుకున్నాను. కొన్ని కథలు కూడా తయారు చేసుకున్నాను. ఓటీటీకీ, ఫ్యూచర్ ఫిల్మ్‌కి రెండిటికీ ట్రై చేస్తున్నాను' అని చెప్పారు నిహిర్ కపూర్.

# మనసు నిండా ఆనందాన్ని నింపే పాత్ర ఇది



'భక్షక్'లో నా పాత్ర కథను నడిపిస్తుంది. అరుదుగా మాత్రమే ఇలాంటి పాత్రలు దొరుకుతాయి. ఓ విధంగా నా మానసిక స్థితిని మెరుగుపరచిందీ ఈ పాత్ర' అంటున్నారు భూమి పెడ్నేకర్. వాస్తవ సంఘటనల ఆధారంగా పులకిత్ తెరకెక్కించిన చిత్రం 'భక్షక్'. ఇందులో విశాలీ సింగ్‌గా నటించిన భూమికి విమర్శకుల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. ఇటీవలే ఓటీటీలో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో భూమి ఆసక్తికరంగా మాట్లాడింది. 'ఇదో విభిన్నమైన అనుభవం. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఈ సినిమా అలరిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. ఇన్‌స్టా మొత్తం ప్రశంసల వర్షం కురుస్తున్నది. ఇంతటి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు మా టీమ్ తరపున కృతజ్ఞతలు' అన్నారు భూమి. ఇంకా చెబుతూ 'సందేశాత్మక చిత్రాల్లో నటించడం నాకిష్టం. బ్యాంక్ బేలన్స్ నింపే పాత్రలు తరచూ వస్తూనేవుంటాయి. కానీ మనసు నిండా ఆనందాన్ని నింపే పాత్రలు మాత్రం అరుదుగా వస్తుంటాయి. ఇది అలాంటి పాత్ర.' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు భూమి పెడ్నేకర్.